క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



ఫిరంగిపురం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహాత్మా గాంధీ చేనేత సొసైటీ, అంబేడ్కర్ హరిజన సొసైటీలో పని చేసే చేనేత కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. వీరి ఇబ్బందులను ఇన్‌చార్జి తహసీల్దారు రాజా రమేష్ మోహన్ కలెక్టర్ నాగలక్ష్మి, ఎమ్మెల్యే టి.శ్రావణ్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో చేనేత కార్మికులకు నిత్యావసర సరుకులు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. గురువారం 72 మంది చేనేత కార్మికులకు 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండవ నరసింహారావు, రామిరెడ్డి, కె.విష్ణువర్ధనరావు, పి.తామాసు, కె.కొండలరావు, అప్పారావు, వై.ప్రకాష్, హృదయరాజు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే బిడ్డకు ఆరోగ్యం



ఫిరంగిపురం: గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందని ఇన్‌చార్జి ఎంపీడీవో నిర్మల లక్ష్మీకుమారి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం పోషకాహార మాసోత్సవాలలో భాగంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. సీడీపీవో పి.ప్రసూన ఆకుకూరలు, పాలు, పండ్లు, పప్పు ధాన్యాలు ప్రధాన్యతను వివరించారు. పోషకహారాన్ని అందజేశారు. సూపర్‌వైజర్ వెంకటేశ్వరమ్మ, అంగన్‌వాడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మంగళగిరి: పట్టణంలోని కొత్తపేట, భవాని హాస్పిటల్ రోడ్డు, గౌతమ బుద్ధా రోడ్డు, లక్ష్మీ నృసింహస్వామి ఆలయం వెనుక ప్రాంతం, మెయిన్ బజార్‌లో శుక్రవారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా జరుగుతున్న అంతరాయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

మండలస్థాయి క్రీడా జట్ల ఎంపిక



తాడికొండ: గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులను ప్రోత్సహించేందుకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అత్తోట దీప్తి అన్నారు. గురువారం తాడికొండ ఏపీ గురుకుల పాఠశాలలో అండర్-14, 17 విభాగాల్లో తొలి రోజు ఖోఖో, కబడ్డీ పోటీలు నిర్వహించి, మండల జట్లను ఎంపిక చేశారు. శుక్రవారం వాలీబాల్, అథ్లెటిక్స్, శనివారం యోగా, షటిల్ బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ వై.రాజారెడ్డి తెలిపారు. ఎంఈఓలు తెనాలి ఇందిర, ప్రభాకరరావు, పాఠశాల ప్రిన్సిపల్ జోగారావు, పీఈటీలు సతీష్, శ్రీనివాసరావు, గురుస్వామి, జగదీష్ రెడ్డి, అజయ్, నాగయ్య, అనిల్‌కుమార్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చిన్నారులకు ఉచిత సంకీర్తన శిక్షణ

తెనాలి: పట్టణ రామలింగేశ్వరపేట డిపోరోడ్డుకు చెందిన శ్రీసాయిరాం సంగీత కళాశాలలో చిన్నారులకు ఉచిత గోవిందనామ సంకీర్తన శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ వరుఘుల లక్ష్మీసునీత గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సంస్థ ఆధ్వర్యంలో 108 మంది పిల్లలకు గోవింద నామసంకీర్తన శిక్షణ ఇచ్చి, ఉచితంగా తిరుపతి తీసుకువెళ్లి, అక్కడ గోవిందనామ సంకీర్తన చేయిస్తామని తెలిపారు. అనంతరం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం చేయించి, తెనాలికి చేరుస్తామని వివరించారు. 8 ఏళ్ల నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలు మాత్రమే అర్హులని తెలిపారు. ఆసక్తి కలిగినవారు 9949313519, 9182551697 నంబర్లలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

సాల్వేషన్ ఆర్మీ ఇండియా దినోత్సవం

తెనాలి: పట్టణ అయితానగర్‌లోని రక్షణ సైన్యం సెంట్రల్ కోర్‌లో గురువారం రక్షణ సైన్య పతాకాన్ని ఆవిష్కరించారు. 1882 సెప్టెంబరు 19న ఫ్రెడ్రిక్ టక్కర్ ఇండియాకు రక్షణ సైన్య పతకాన్ని తీసుకువచ్చారనీ, ఇప్పటికీ 142 సంవత్సరాలు పూర్తిచేసుకుని, 143వ ఏడాదిలోకి ప్రవేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మేజర్ వి.ఏసుపాదం, మేజర్ పి.రత్నసుందరి, సంఘ పెద్దలు బట్టు జక్రయ్య, గాలి రవికుమార్, పిల్లి కనకరత్నం, కె.నరసింహారావు, ఆర్.ఆశీర్వాదం, కమిటీ, గృహసమితి పెద్దలు, యౌవనస్తులు హాజరై సంఘ సేవలను ప్రశంసించారు.

డంపింగ్ యార్డుగా ఆత్మకూరు చెరువు

- జంతు కళేబరాలను పడేస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు
- కలుషితమవుతున్న చెరువు నీరు
- ఎయిమ్స్ తాగునీటి అవసరాలకి తరలించే పనులు



ఆత్మకూరు చెరువులో వ్యర్థాలు



పడవేసిన జంతు కళేబర వ్యర్థాలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో అతిపెద్దది ఆత్మకూరు చెరువు. ఇప్పుడు కార్పొరేషన్ డంపింగ్ యార్డుగా మారుతోంది. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రభుత్వాలు డంపింగ్ యార్డులను తొలగించే ప్రక్రియ చేపట్టాయి. కార్పొరేషన్ పరిధిలో దానికి విరుద్ధంగా వ్యవహరిస్తూ చెత్తాచెదారాన్ని చెరువుల్లో పడేస్తున్నారు. దీనిని అదునుగా చేసుకుని కొంతమంది జంతువధ చేసేవారు కళేబర వ్యర్థాలను నేరుగా చెరువు నలుమూలలా పడేస్తున్నారు. దీంతో ఆ ప్రాంతం అంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఆత్మకూరు చెరువు నుంచి మంచినీటిని ఎయిమ్స్ తాగు నీటి అవసరాల నిమిత్తం అందించేందుకు ప్రజా ఆరోగ్య శాఖ సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా ఇప్పటం, ఆత్మకూరు రోడ్డు వెంబడి చెరువు నీటిని శుద్ధి చేసేందుకు నిర్మాణ పనులు కూడా చేపట్టింది. నీరు తగ్గినప్పుడల్లా నేరుగా గుంటూరు చానల్ నుంచి చెరువును నింపేవిధంగా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. మరికొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తికావస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో చెరువులో చుట్టు పక్కల ఉత్పత్తి అయ్యే చెత్తాచెదారాన్ని, మంగళగిరి తదితర ప్రాంతాల నుంచి జంతు వ్యర్థాలను పడేయడం ప్రమాదకరంగా మారింది. ఇలా చేయడం వల్ల చెరువులో ఉన్న నీటిని బయటకు పంపించడం చాలా కష్టతరమవుతుంది. ఈ విషయాలను అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కార్పొరేషన్ అధికారులు ఆత్మకూరు చెరువులో చెత్తాచెదారాన్ని, జంతు వ్యర్థాలను పడేయకుండా జాగ్రత్తలు తీసుకుంటే.. ఏడాది కాలంలో ఎయిమ్స్‌కు తాగునీటిని సరఫరా చేయవచ్చని స్థానికులు చెబుతున్నారు.

కొనసాగుతున్న వినాయక చవితి ఉత్సవాలు



గణపతి మండపంలో కమిటీ ప్రతినిధులు



కృష్ణబలిజ సంఘం ఆధ్వర్యంలో పూజలు

మంగళగిరి: పట్టణంలో పలు చోట్ల వినాయక చవితి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. గురువారం నవులూరు గోలివారి తోటలో ఏర్పాటు చేసిన మండపం వద్ద అన్నదానం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామోత్సవం నిర్వహించారు. కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించి, పూజలు నిర్వహించారు. గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

భారీ అన్నదానం

తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్‌లో శ్రీ గణేష్ యూత్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చవతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. 16వ రోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్నదానం చేశారు.



అన్నదానం చేస్తున్న శ్రీ గణేష్ యూత్ ఉత్సవ కమిటీ నిర్వాహకులు

ఇరిగేషన్.. మర్రి మొక్కల ప్లాంటేషన్

కృష్ణా నదిపై ప్రకాశం బ్యారేజీకు అనుసంధానంగా సాగు, తాగునీటి అవసరాల కోసం బకింగ్ హామ్ కెనాల్, కొండవీటి వాగు, గుంటూరు చానల్‌ను ఉపయోగించుకుంటున్నారు. ఇవి ప్రవహించే ప్రాంతాల్లో ఇరిగేషన్ అధికారులు 1950 అనంతరం కొన్ని బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టారు. ప్రస్తుతం ఈ బ్రిడ్జిలకు, లాకులకు మర్రి మొక్కలు సవాలు విసురుతున్నాయి. ఏ బ్రిడ్జి మీద చూసిన పదుల సంఖ్యలో మర్రి మొక్కలు మొలిచి దర్శనమిస్తున్నాయి. వాటిని తాత్కాలికంగా ఇరిగేషన్ అధికారులు కనిపించినంత వరకు తొలగిస్తున్నారు. అయినా కాంక్రీట్ దిమ్మలను పగలగొట్టుకుంటూ పెరగడంతో బ్రిడ్జిలకు, లాకులకు పెను ప్రమాదం పొంచిఉంది. మర్రి మొక్కల సమస్యను అధికారులు పూర్తిస్థాయిలో పరిష్కరించాల్సిన అవసరం ఉంది. –తాడేపల్లిరూరల్



కొండవీటి వాగు కృష్ణా నది లాకుల వద్ద మొలిచిన మర్రి మొక్కలు

ప్రతిష్టాత్మకంగా ఇళ్ల నిర్మాణం

రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

మేడికొండూరు: గుంటూరు జిల్లా పేరేచర్లలో ఉన్న రాష్ట్రంలోనే అతిపెద్ద ఇళ్ల నిర్మాణాల లే-అవుట్‌ను గురువారం రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకొని 11 వేల ఇళ్ల నిర్మానాలను మార్చిలోపు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. నిర్మాణాలకు అవసరమైన రెండు వేల టన్నుల ఇసుకను గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలోనే ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రధాన రోడ్లు నిర్మించి, విద్యుత్ సౌకర్యం అందరికీ అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ప్రతి ఇంటికి నీటి సౌకర్యం అందిస్తామన్నారు. గుంటూరు నుంచి ఆర్టీసీ రవాణా సౌకర్యం కూడా కల్పిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, గల్లా మాధవి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



తాడికొండ: తుళ్లూరు మండలం పెదలంక వరద బాధిత విద్యార్థులకు విశ్రాంత పోస్టల్ ఉద్యోగి, న్యాయవాది మేరిగ మోహన్ ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువ చేసే పుస్తకాలు, బ్యాగులు, పరీక్ష ప్యాడ్‌లను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తుళ్లూరు పీహెచ్‌సీ వైద్యులు శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కంతేటి బ్రహ్మయ్య పాల్గొన్నారు. విపత్తులు సంభవించినపుడు బాధితులకు సహకారం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. విశ్రాంత ఉపాధ్యాయులు గంగిమాల ఇజ్రాయేల్, హెచ్ఎం సురేష్, సాగర్, స్థానిక నాయకులు మెండెం నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎన్నారై విద్యార్థుల సాయం



మేడికొండూరు: స్థానిక ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు సాయం చేసేందుకు ముందుకొచ్చారు. ఐదు రోజులు సింగ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులు అందజేశారు. తోటి విద్యార్థుల నుంచి సేకరించిన రూ.35 వేలు పేద ప్రజలకు అందించారు. కళాశాల ప్రిన్సిపల్ కోటా శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్‌బాబు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా అభినందన కార్యక్రమంలో సెక్రటరీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, విభాగాధి పతులు పాల్గొన్నారు.

నేటినుంచి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీలు

తెనాలి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడాపోటీలు శుక్రవారం స్థానిక అయితానగర్‌లోని ఎన్ఎస్ఎస్ మున్సిపల్ హైస్కూలులో జరుగుతాయని మండల కో-ఆర్డినేటర్ ఎం.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి అండర్-14, 17 విభాగాల్లో విద్యార్థులకు తొలిరోజున అథ్లెటిక్స్, రెండో రోజు ఆటల పోటీలు జరుగుతాయని వివరించారు. 80086 56217, 77807 76356 నంబర్లను సంప్రదించాలని కోరారు.

పాఠ్యాంశ ప్రణాళిక పుస్తకాల ఆవిష్కరణ

తెనాలి: పాఠశాలలకు అవసరమైన మధ్యాహ్న భోజనం, లెసన్ ప్లాన్ పుస్తకాలను (పాఠ్యాంశ ప్రణాళిక) గురువారం నాజరుపేటలోని శ్రీలలితా అండ్ కో ప్రింటింగ్, ట్రైనింగ్ బుక్స్, స్టేషనరీ ప్రధాన కార్యాలయంలో తెనాలి ఉప విద్యాశాఖాధికారిణి శాంతకుమారి ఆవిష్కరించారు. తెనాలి ఎంఈఓలు డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ, వి.జయంత్‌బాబు, లలితా అండ్ కో సంస్థల అధినేత కె.సుబ్రహ్మణ్యం, కుమార్ పాల్గొన్నారు. పాఠశాల, కళాశాల, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని పుస్తకాలను దశాబ్దాలుగా తమ సంస్థ అందజేస్తోందని నిర్వాహకులు వివరించారు.

సమష్టి కృషితో బాల్య వివాహాలకు అడ్డుకట్ట



కరపత్రం విడుదల చేస్తున్న ఎంఈవో

పాములపాడు(తాడికొండ): బాల్య వివాహాలను అరికట్టేందుకు సమష్టి కృషి అవసరమని ఎంఈవో-2 డి.ప్రభాకరరావు అన్నారు. పాములపాడు గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్- క్రాప్ ఆధ్వర్యంలో గురువారం బాల్య వివాహాల నియంత్రణ అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాల నియంత్రణకు తమవంతు పాటుపడాలన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగినట్లు తెలిస్తే గ్రామ మహిళా సంరక్షణా కార్యదర్శి, లేదా 1098 చైల్డ్ హెల్ప్ లైన్, డయల్ పోలీస్ 100, మహిళా హెల్ప్ లైన్ 181కు ఫోన్ ద్వారా సమాచారమందించాలని సూచించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ కళావతి, కార్యదర్శి ఎ.రామారావు, క్రాప్ ట్రైనింగ్ కో- ఆర్డినేటర్ చిలకా ప్రభాకర్, వీఆర్వో తిరుపతమ్మ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కేఎల్ పూర్ణిమ, హెచ్ఎం ఎండీ గౌస్ పలువురు గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి దిష్టిబొమ్మ దహనం




దిష్టి బొమ్మను దహనం చేస్తున్న రామకృష్ణ

తెనాలిరూరల్: కేంద్ర సహాయ మంత్రి రణ్‌వీత్ సింగ్ బిట్టు, షిండే శివసేన ఎంఎల్ఏలు రాహుల్ గాంధీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ గుంటూరు పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దారా రామకృష్ణ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి దిష్టి బొమ్మను దహనం చేశారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెనాలి నియోజకవర్గ కన్వీనర్ గొరికపూడి అశోక్, దాస్, వంశీ, పవన్, షాలేము, కార్ స్టాండ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

త్రీ టౌన్‌లో ఫిర్యాదు..

రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రణ్‌వీత్ సింగ్ బిట్టు, తర్వీంతర్‌సింగ్ మిర్వా, రఘునాథ్ సింగ్‌లపై కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు, పట్టణ అధ్యక్షుడు పొన్నూరు నాగసూర్య శిఖరరావు, పెనుగొండ శివకుమార్, ఎస్.మాధవరావు, రాయప్ప తదితరులు గురువారం తెనాలి త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న మన్నంగి ఆగరాజు

తెనాలిరూరల్: ఎస్సీ వర్గీకరణ విజయ సారథిగా ఈ నెల 21న మొట్ట మొదటగా తెనాలి పట్టణానికి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగకు గుంటూరు జిల్లాలోని మాదిగ ప్రజలు ఘన స్వాగతం పలకాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం మారిస్‌పేటలోని మేకల సురేష్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 21న మార్కెట్ యార్డులో జరిగే మాదిగల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ రానున్నట్లు తెలిపారు. వర్గీకరణ విజయసారథిగా వస్తున్న మంద కృష్ణ మాదిగకు మాదిగ ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఘన స్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు మొదటగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణ చట్టబద్ధతకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేమూరి సుధీర్ మాదిగ, సీనియర్ నాయకులు కూచిపూడి సత్యం, మాదిగ, ఆహ్వాన కమిటీ నాయకులు మేకల సురేష్, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మురికిపూడి హృదయరాజు మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు కొండముది బోస్‌మాదిగ, తెనాలి జయ్ ప్రకాష్ మాదిగ, నియోజకవర్గ కన్వీనర్ భూదాల పవన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సాయమందించాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఫిరంగిపురం: రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు అందించాలని కౌలు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, కౌలు రైతు సంఘాల మండల నాయకులు పొనుగుపాడు సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నదాత పెట్టుబడి సాయం కింద నగదు అందజేసి, రైతులను ఆదుకోవాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, రూ.2లక్షల వరకు రుణ మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎ.కృష్ణ, డి.పోతురాజు, పి.చంద్రమౌళి, షేక్.హుస్సేన్, వై.రత్నకుమారి పాల్గొన్నారు.

భూములను వెంటనే అభివృద్ధి పరచాలి

- గతంలో మాదిరి అభివృద్ధి చేయకుంటే నమ్మే పరిస్థితి లేదు
- మంత్రి పొంగూరు నారాయణతో రైతులు

మంగళగిరి: రాజధానికి తీసుకున్న భూములను వెంటనే అభివృద్ధి పరచాలని రైతులు రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణను కోరారు. గురువారం రాత్రి సీఆర్‌డీఏ పరిధిలోని నిడమర్రులో భూములు ఇవ్వని రైతులు నివాసాలకు వెళ్లి వారికి నచ్చజెప్పి భూములు సేకరించే పనిలో పడ్డారు. నిడమర్రు, కురగల్లు గ్రామాలకు చెందిన పది మంది రైతుల నుంచి 17 ఎకరాల భూములను తీసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రాజధాని కోసం 2019లో సీఆర్‌డీఏ తీసుకున్న భూములను అభివృద్ధి పరచకపోవడంతో అడవులుగా మారాయని, మళ్లీ ఇపుడు తీసుకున్న భూములను వెంటనే అభివృద్ధి పరచకపోతే టీడీపీ ప్రభుత్వాన్ని రైతులు నమ్మే పరిస్థితి లేకపోగా తిరిగి వ్యవసాయం చేసుకుంటారన్నారు. మంత్రి నారాయణ మట్లాడుతూ రాజధానిని వెంటనే అభివృద్ధి పరచేలా చర్యలు తీసుకుంటామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నచ్చచెప్పారు.

భద్రతపై విద్యార్థినులకు అవగాహన



విద్యార్థినులతో యూనివర్శిటీ ప్రతినిధులు

తెనాలి: సమాజంలో ఆడపిల్లలు, మహిళలపై జరుగుతున్న అరాచకాలపై పిల్లలు, తల్లులకు అవగాహన కల్పించి, తగిన జాగ్రత్తలు తీసుకొనేలా వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్శిటీ కృషిచేస్తోందని ఆ యూనివర్శిటీకి చెందిన విమెన్ డెవలప్‌మెంట్ సెల్‌కు చెందిన బి.హరణి, ఎ.భాను ప్రియాంక వెల్లడించారు. యూనివర్శిటీ సెల్ ముఖ్యకార్యక్రమమైన 'ట్రైనింగ్ ఫర్ మదర్స్ అండ్ స్కూల్ చిల్డ్రన్ ఆన్ ది సేఫ్టీ' అవగాహన కార్యక్రమాన్ని గురువారం రూరల్ మండలం పెదరావూరులోని ఎంపీపీ-ఏటీ పాఠశాలలో విద్యార్థినులు, తల్లులకు నిర్వహించారు. సేఫ్ ప్లేస్, అన్‌సేఫ్ ప్లేస్, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై చిత్రపూర్వకంగా అవగాహన కల్పించారు. పిల్లల పట్ల ఎలా జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై తల్లులకు తెలియజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని పిచ్చమ్మ, యూనివర్శిటీ వీసీ పార్థసారథి, ఇతర ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు ఆదాయ పన్నుపై అవగాహన సదస్సు

తెనాలి: ది తెనాలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం తెనాలిలో ఆదాయ పన్నుపై అవగాహన సదస్సు నిర్వహించారు. పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలోని కళ్యాణమండపంలో సాయంత్రం 4.30 గంటలకు ఏర్పాటయే సదస్సుకు ఛాంబర్ అధ్యక్షుడు దేసు శ్రీనివాసరావు అధ్యక్షత వహిస్తారు. ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ కమిషనర్ సునీత బిల్ల, గౌరవ అతిథులుగా ఆదాయపన్నుశాఖ గుంటూరు 1,2 రేంజి అడిషనల్ కమిషనర్ డాక్టర్ ఓ.ఎస్.సుప్రియారావు, తెనాలి ఆదాయ పన్ను అధికారి జేజీఎస్ కిషోర్‌కుమార్ హాజరవుతారు. పట్టణానికి చెందిన వ్యాపారులు, వైద్యులు, న్యాయవాదులు, ఇతర వృత్తులవారు హాజరుకావాలని తెనాలి ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శులు గుండా రామకోటేశ్వరరావు, రావూరి సుబ్బారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

నీరంతా వృథా

రామలింగేశ్వర పేట పులిపాటివారి వీధిలోని రక్షిత మంచినీటి పైపులైనులో లీక్ ఏర్పడింది. దీంతో మంచి నీరు వదిలిన సమయంలో పైపు నుంచి నీరు వృథాగా పోతోంది. మూడు రోజుల నుంచి ఈ పరిస్థితి కొనసాగుతోందని, పట్టించుకున్న వారు లేరంటూ స్థానికులు చెబుతున్నారు. వాటర్ వర్క్స సిబ్బంది ఈ లీకుపై దృష్టిసారించాలని కోరుతున్నారు.

–తెనాలిఅర్బన్

